నాటకాలకు పూర్వ వైభవం

- అమరాపురంలో గత ఏడాది 50 నాటకాలకు పైగా ప్రదర్శన
- ఉత్సవం ఏదైనా కచ్చితంగా నాటకాలు ప్రదర్శిస్తున్న వైనం
- ఉపాధి దొరకుతోందని కళాకారుల హర్షం



నాటకాన్ని వీక్షిస్తున్న ప్రజలు



అమరాపురం మండలంలో నాటకాన్ని ప్రదర్శిస్తున్న దృశ్యం

అమరాపురం: ఒకప్పుడు టీవీలు లేవు... సినిమా హాళ్లు కూడా తక్కువే. అయితే నాటకాల ప్రదర్శన మాత్రం అందరినీ ఆకట్టుకునేవి. చుట్టు పక్కల గ్రామాల నుంచి కూడా పెద్ద సంఖ్యలో నాటకం వేసే ప్రాంతానికి జనం తరలివచ్చేవారు. అయితే మారుతున్న కాలానికి అనుగుణంగా ప్రస్తుతం నాటకాల ప్రదర్శన కూడా కనుమరుగవుతోంది. ఇదిలా ఉంటే మడకశిర నియోజకవర్గంలోని అమరాపురంలో మాత్రం నాటకాల ప్రదర్శనకు ఆదరణ తగ్గడం లేదు.

50కి పైగా నాటకాలు

అమరాపురం మండలంలో ప్రస్తుతం నాటకాలకు పాత క్రేజ్ వచ్చేసింది. ఏ గ్రామంలోనైనా సరే ఏదైనా తిరునాళ్ల లేదా ఉత్సవాలు జరిగితే కచ్చితంగా నాటకాలను ప్రదర్శిస్తున్నారు. అమరాపురంలో గత ఏడాది నుంచి ఇప్పటి దాకా 50 నాటకాలను ప్రదర్శించారు. అందరూ ఆదరిస్తుండటంతో నాటకాల నిర్వాహకులు కూడా విరివిగా నాటకాలను ప్రదర్శించడానికి ముందుకు వస్తున్నారు.

విరివిగా ఉపాధి

ఒక్కో నాటకాన్ని ప్రదర్శించాలంటే నిర్వాహకులకు రూ.లక్ష దాకా ఖర్చు వస్తుంది. నాటకాల ప్రదర్శన వల్ల అనేక మందికి ఉపాధి దొరుకుతోంది. ముఖ్యంగా హార్మోనియం మాస్టర్, తబలా, క్లార్నెట్, నాటిక ప్రదర్శనకు కావాల్సిన సామగ్రి యాజమాని, అలాగే మహిళ పాత్రలో నటించడానికి వివిధ ప్రాంతాల నుంచి మహిళలు వచ్చి నాటికల్లో పాల్గొంటుంటారు. దీంతో వీరందరికీ ఉపాధి దొరుకుతోంది. రాత్రి 10 గంటలకు నాటిక ప్రారంభమైతే ఉదయం 5 గంటల వరకూ ప్రదర్శన నిర్వహిస్తున్నారు. అయినా కూడా ప్రజలు అధిక సంఖ్యలో నాటికలు చూడడానికి ఉత్సాహం చూపుతున్నారు. ఇదిలా ఉంటే అమరాపురం మండలం శ్రీసత్యసాయి జిల్లాలో ఉన్నా ఎక్కువ నాటికలు మాత్రం కన్నడలోనే ప్రదర్శిస్తున్నారు. కర్ణాటక రాష్ట్రం నుంచి ప్రజలు, కళాకారులు వచ్చి నాటకాలను చూసి హర్షం వ్యక్తం చేస్తున్నారు.

నాటకాలంటే ఇష్టం



మా గ్రామంలో ప్రతి ఏటా మూడు నాటికలను ప్రదర్శిస్తారు. నేను చిన్ననాటి నుంచి నాటికలు చూస్తున్నా. నాకు నాటికలో నటించాలని ఉంది. మా నాన్నకు చెప్పి గత నవంబర్‌లో ప్రదర్శించిన దేవీ మహత్యం నాటికలో బాల రక్తబీజాసురగా నటించాను.

– అభిషేక్, తమ్మడేపల్లి, అమరాపురం మండలం

పౌరణిక పాత్రలనే వేస్తా..



నాకు పౌరణిక నాటికలంటే చాలా ఇష్టం. వాటిలో లీనమై పాత్రకు తగ్గట్టు నటిస్తా. గత డిసెంబర్‌లో జరిగిన నాటికలో భీముని పాత్రను వేశాను. నాకు కళలంటే చాలా ఇష్టం. ప్రతి సంవత్సరం నాటికలో నటిస్తా. రూ.10 వేల వరకూ ఖర్చు వస్తుంది. ఎక్కడ నాటికలు ప్రదర్శించినా వెళ్లి చూసొస్తా.

– నాగేగౌడ, దేవగానపల్లి, అమరాపురం

ఉపాధి దొరుకుతోంది



మాది కర్ణాటక రాష్ట్రంలోని చిత్రదుర్గం. గతంలో నాటికలకు అధిక ప్రాధాన్యత ఇచ్చేవారు. కొన్నేళ్ల క్రితం వరకూ నాటికలు కనుమరుగయ్యాయి. అయితే ప్రస్తుతం నాటికలకు మంచి గిరాకీ వచ్చింది. నిజంగా చెప్పాలంటే పునర్ వైభవం వచ్చిందనే చెప్పాలి. నేను ప్రతి సంవత్సరం ఈ ప్రాంతంలో నిర్వహించే నాటికలకు వస్తా. అన్ని పాత్రల్లో నటిస్తా. ఒక నాటికకు రూ.10 వేలు ఇస్తారు. సంవత్సరానికి రూ.3 లక్షల వరకూ సంపాదిస్తున్నాను. నాటికల వల్ల నాకు ఉపాధి దొరుకుతోంది.

– లక్ష్మీ, నటి, చిత్రదుర్గం, కర్ణాటక రాష్ట్రం

ఎక్కడ నాటకాలు వేసినా వెళ్తా..



గ్రామాల్లో నాటకాలు ఎక్కడ ప్రదర్శించినా అక్కడికి వెళ్తా. నాకు నాటికలు అంటే ప్రాణం. అక్కడ వివిధ పాత్రల్లో ప్రదర్శన చూస్తుంటే నేనే నటిస్తున్నాననే భావన వస్తోంది. నేను కూలీ పనులు చేస్తూ జీవనం చేస్తున్నా. అయినా సంవత్సరానికి రెండుసార్లు నాటికాల్లో ప్రదర్శన కూడా ఇస్తున్నా.

– ఈరలింగప్ప తమ్మడేపల్లి, అమరాపురం మండలం.

మహిళా రైతుపై దాడి హేయం

- పావగడలో బాధితులు, రైతుల తీవ్ర ఆందోళన



తాలూకా కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహిస్తున్న లక్ష్మిదేవి, రైతులు

పావగడ: భూమిని లాక్కున్నారని ఆక్రోశించిన మహిళ లక్ష్మీదేవిని బూటు కాళ్ళతో తన్ని బలవంతంగా సోలార్ కంపెనీ వాహనంలో ఎక్కించి బెంగళూరు సెంట్రల్ జైలుకు తరలించ డానికి కారణమైన స్థానిక డీఎస్పీ రామచంద్రప్ప ను వెంటనే సస్పెండ్ చేయాలని బాధితురాలు, రైతు సంఘం నేతలు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక తాలూకా కార్యాలయం ఎదుట లక్ష్మీదేవి, రైతు నాయకులు సోమవారం పెద్దఎత్తున ఆందోళన నిర్వహించారు. లక్ష్మీదేవి మాట్లాడుతూ.. తన భర్త పాతలింగప్ప.. తనకు, కుమార్తె అంబికకు తెలియకుండా కడపలకెరె గ్రామంలోని 2 ఎకరాల భూమి ని హరియానా కు చెందిన ఓ సోలార్ కంపెనీకి గత ఏడాది మార్చిలో రిజిస్టర్ చేయించాడని తెలిపింది. ఇది అక్రమమని తమ భూమిలో సోలార్ పనులు చేయరాదని కోరితే, పట్టించుకోకుండా యథేచ్ఛగా నిర్వహిస్తున్నారని వాపోయారు. ఈ క్రమంలో ఈ నెల 19 న తమను సోలార్ కంపెనీ వాళ్ళు పిలుస్తున్నారని పొలం వద్దకు రావాలని పోలీసులు ఫోనులో పిలిచారన్నారు. మధ్యాహ్నం 1 గంటకు పొలం వద్దకు వెళ్ళామని, అక్కడకు పోలీసులు తనను బలవంతగా పట్టుకుని పోలీసు జీపు లో ఎక్కించుకుని పావగడ పోలీస్ స్టేషన్ కు తరలించారన్నారు.

డీఎస్పీ దాష్టీకం

అక్కడ డీఎస్పీ రామచంద్రప్ప తనను పరుష పదజాలంతో దూషించి బూటు కాళ్ళతో తన్ని రాత్రి 9 గంటల సమయంలో సోలార్ కంపెని వాహనం లో బెంగుళూరు లోని పరప్పన అగ్రహార సెంట్రల్ జైలుకు తరలించారని ఆవేదన వ్యక్తం చేసింది. కాగా ఈ సంఘటనను రైతు నేతలు పూజారప్ప, కృష్ణస్వామి, సీఐటీయూ అధ్యక్షురాలు సుశీలమ్మ తీవ్రంగా ఖండించారు. ఉప తహసీల్దార్ చంద్రశేఖర్ కు వినతి పత్రం అందించారు. హోంమంత్రి పరమేశ్వర్ సొంత జిల్లా తుమకూరులోనే పోలీసులు అరాచకాలకు పాల్పడుతున్నారని, ప్రజలకు భద్రత లేదని ఆందోళనకారులు ఆరోపించారు.

ఎన్నికలకు సిద్ధమవ్వండి

- వైఎస్సార్‌సీపీ రీజినల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి



తిరుపతిలో జరిగిన సమావేశానికి హాజరైన వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త దీపిక

హిందూపురం: ఎన్నికలకు వైఎస్సార్‌సీపీ నాయకులందరూ సన్నద్ధం కావాలని మంత్రి, వైఎస్సార్‌సీపీ రాయలసీమ రీజినల్ కోఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పిలుపు నిచ్చారని వైఎస్సార్‌సీపీ హిందూపురం నియోజకవర్గ సమన్వయకర్త టీఎన్. దీపిక తెలిపారు. తిరుపతిలో పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆధ్వర్యంలో సోమవారం పార్టీ రీజినల్ క్యాడర్ మీటింగ్ సన్నాహక సమావేశం జరిగిందన్నారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలు ఇచ్చినట్లు వివరించారు.

అంగన్‌వాడీ భవనాల మరమ్మతుకు నిధులు

అగళి: మండల కేంద్రంలోని అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం సీడీపీఓ నాగమల్లేశ్వరి ఆధ్వర్యంలో మండలంలోని అంగన్‌వాడీ కార్యకర్తలకు సెక్టార్ సమావేశం నిర్వహించారు. మండలంలోని 26 అంగన్‌వాడీ కేంద్రాల మరమ్మతు కోసం ఫేస్ టు నాడు–నేడు పనుల కింద నగదును ప్రభుత్వం మంజూరు చేసిందన్నారు. అనంతరం నెలవారి రికర్డులను పరిశీలించారు.

జట్టు సభ్యులకు అభినందన

హిందూపురం అర్బన్: గణతంత్ర దినోత్సవ వేడుకలు పురస్కరించుకొని ట్రాన్స్‌కో ఆధ్వర్యంలో విజయవాడలో నిర్వహించిన క్రీడా పోటీల్లో హిందూపురం జట్టు ప్రతిభ కనబరిచింది. ట్రాన్స్‌కో సీఎండీ విజయానంద్, జేఎండీ విజిలెన్స్ అధికారి మల్లారెడ్డి నుంచి ప్రశంశాపత్రాలు అందుకున్నారు. సోమవారం హిందూపురం డివిజనల్ కార్యాలయం వద్ద ప్రతిభ కనబరిచిన అధికారి సి. ప్రభాకర్, జట్టు సభ్యులను ఉద్యోగులు అభినందించారు.

పోలీసుల అదుపులో అనుమానితుడు

పెనుకొండ రూరల్: అనుమానంగా సంచరిస్తున్న వ్యక్తిపై గ్రామస్తులు దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించిన సంఘటన మండల పరిధిలోని శెట్టిపల్లిలో ఆదివారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. స్థానికుల వివరాల మేరకు... గోరంట్ల మండలంలోని గంగంపల్లికి చెందిన రాజేష్ శెట్టిపల్లిలో అనుమానంగా సంచరిస్తుండగా గ్రామస్తులు పట్టుకున్నారు. దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పగించారు. దీనిపై ఎస్ఐ రాజేష్‌ను 'సాక్షి' వివరణ కోరగా విచారణ జరుపుతున్నామన్నారు.

లేపాక్షి ఆలయంలో ప్రత్యేక పూజలు



అలంకరణలో వీరభద్రస్వామి

లేపాక్షి: ప్రముఖ పర్యాటక కేంద్రమైన లేపాక్షిలోని వీరభద్రస్వామి దేవాలయంలోని దుర్గాదేవి, వీరభద్రస్వాములకు సోమవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివార్ల మూలరాట్ విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి విశేషంగా పూజలు చేశారు. అభిషేకార్చనలు, తీర్థప్రసాద వినియోగం, మహా మంగళారతి ఇచ్చారు.



ప్రత్యేక అలంకరణలో దుర్గాదేవి

వైఎస్సార్‌సీపీలోనే దళితులకు గౌరవం

- సంక్షేమ పథకాలే వైఎస్సార్‌సీపీకి శ్రీరామరక్ష
- మాజీ మంత్రి హెచ్‌బీ నర్సేగౌడ్, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి



విలేకరులతో మాట్లాడుతున్న నర్సేగౌడ్, వైటీ ప్రభాకర్‌రెడ్డి

మడకశిర: వైఎస్సార్‌సీపీలోనే దళితులకు గౌరవం పెరిగిందని మాజీ మంత్రి హెచ్‌బీ నర్సేగౌడ్, మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి ,రాష్ట్ర కార్యదర్శులు వైసీ గోవర్ధన్‌రెడ్డి, వైఎస్ రవిశేఖర్‌రెడ్డి, జీబీ శివకుమార్ తెలిపారు. సోమవారం వారు మాజీ ఎమ్మెల్యే వైటీ ప్రభాకర్‌రెడ్డి స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. వైఎస్సార్‌సీపీలో దళితులకు గౌరవం లేదని కొంత మంది అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు. మడకశిర వైఎస్సార్‌సీపీ సమన్వయకర్తగా కడు పేద దళిత కుటుంబానికి చెందిన ఈర లక్కప్పను సీఎం వైఎస్ జగన్ నియమించిన విషయాన్ని గుర్తుంచుకోవాలని హితవు పలికారు. కేవలం కొంత మంది వ్యక్తి గత ప్రయోజనాల కోసం దళితులను వాడుకొంటుంటే ... ముఖ్యమంత్రి వైఎస్ జగన్ దళితులకు కీలకమైన పదవులు ఇచ్చి గౌరవిస్తున్నారని కొనియాడారు. మడకశిర వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈర లక్కప్ప మచ్చలేని నాయకుడన్నారు. అయితే కొంత మంది గిట్టని వారు ఈర లక్కప్పపై తప్పుడు ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. ఈర లక్కప్పపై ఎలాంటి కేసులు లేవని, కొంత మంది కావాలనే కుట్ర పన్ని ఆరోపణలు చేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ మడకశిర నియోజకవర్గ పరిశీలకుడు పోకల అశోక్‌కుమార్ ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పార్టీ కోసం పని చేస్తున్నారని స్పష్టం చేశారు. పోకల అశోక్‌కుమార్‌పై కూడా గిట్టని వారు సామాజిక మాధ్యమాల్లో తప్పుడు ఆరోపణలు చేస్తుండటాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్లు చెప్పారు. వచ్చే ఎన్నికల్లో మడకశిర నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ జెండాను ఎగరవేస్తామని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ చేపట్టిన సంక్షేమ పథకాలే వైఎస్సార్‌సీపీకి శ్రీరామ రక్ష అన్నారు. అపోహలను నాయకులు, కార్యకర్తలు నమ్మవద్దని సూచించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పేదల పక్షాన ఉన్నారని, సంక్షేమం, అభివృద్ధిని ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. నియోజకవర్గంలోని నాయకులు, కార్యకర్తలు సమన్వయంతో పార్టీ గెలుపుకు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో కుంచిటి వక్కలిగ కార్పొరేషన్ డైరెక్టర్ నాగరాజగౌడ్, వైఎస్సార్‌సీపీ పట్టణ కన్వీనర్ పుట్ట కామప్ప, అగళి వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ స్టూడియో శ్రీనివాస్, గుడిబండ జెడ్పీటీసీ భూతరాజు, స్థానిక నాయకులు విజయరంగేగౌడ్, వెంకటరంగారెడ్డి, బేకరినాగరాజు, సత్యనారాయణ, జయప్రకాష్, కౌన్సిలర్ లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికను అంగీకరించం

హిందూపురం: సాధుశెట్టి సంఘంలో మాజీ అధ్యక్షుడు వెంకటస్వామి నియంతలా వ్యవహరించడం సరి కాదని ఆ సంఘం నాయకులు అన్నారు. సోమవారం ప్రెస్‌క్లబ్‌లో వారు విలేకరులతో మాట్లాడుతూ కంచీ కామాక్షి కళ్యాణ మండపంలో జరిగిన సమావేశానికి సంఘానికి ఎలాంటి సంబంధం లేదన్నారు. అడహాక్ కమిటీ డైరెక్టర్ల ప్రమేయం లేకుండా వెంకటస్వామి సంఘం కొత్త పుస్తకాన్ని తెప్పించుకుని కమిటీ ఏర్పాటు జరిగినట్లు రాసుకుని కావాల్సిన వారందరితో సంతకాలు పెట్టించుకుని సంఘం అధ్యక్షుడిగా ప్రకటించుకోవడం సరికాదని, ఎన్నిక అంగీకరించమని మంగేష్, వెంకటేష్, మునిరాజ్, నాగరాజు తెలిపారు.

ఏకగ్రీవ ఎన్నిక

సాధుశెట్టి సంఘ కుల సంఘం గౌరవధ్యక్షుడు నంజుండప్ప అధ్యక్షతన జరిగిన సమావేశంలో సంఘ అధ్యక్షుడిగా వెంకటస్వామిని ఎన్నుకున్నట్లు ప్రకటన విడుదల చేశారు. జనరల్‌బాడీ సమావేశంలో ఏకగ్రీవంగా వెంకటస్వామిని ఎన్నిక జరిగిందన్నారు.

మంత్రిని కలసిన చైర్మన్

లేపాక్షి: మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రరెడ్డిని లేపాక్షి ఆలయ కమిటీ చైర్మన్ కరణం రమానందన్ సోమవారం తిరుపతిలో కలిశారు. లేపాక్షి ఆలయ అభివృద్ధి, లేపాక్షి ఉత్సవాలు నిర్వహణ, జటాయువు మోక్ష ఘాట్ పనుల పునరుద్ధరణ అంశాలను మంత్రి దృష్టికి తీసుకెళ్లగా ఆయన సానుకూలంగా స్పందించినట్లు రమానందన్ తెలిపారు.

యువతతోనే నవ సమాజ నిర్మాణం సాధ్యం

పెనుకొండ: నవ సమాజ నిర్మాణం యువతతోనే సాధ్యమని ప్రభుత్వ సర్వజన వైద్యాధికారి తేజ పేర్కొన్నారు. పట్టణంలోని తోటగేరిలో సోమవారం పరిటాల శ్రీరాములు ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు చెందిన ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సూచనలు, సలహాలిచ్చారు. అనంతరం విద్యార్థులకు ప్రశంశాపత్రాలు అందించారు.

సంక్షిప్త సమాచారం

ఎస్టీయూ కార్యవర్గం ఏర్పాటు

మడకశిర: మండల ఎస్టీయూ కార్యవర్గాన్ని సోమవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా కార్యదర్శి ఆదినారాయణ తెలిపారు. అధ్యక్షుడిగా తిప్పేస్వామి, ప్రధాన కార్యదర్శిగా దొరబాబు, ఆర్థిక కార్యదర్శిగా శ్యామ్యూల్, జిల్లా కౌన్సిలర్లుగా మాలతి, నారాయణప్ప ఎన్నికైనట్లు పేర్కొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

పావగడ: ఆకస్మిక అగ్ని ప్రమాదాలను ఎలా నివారించాలనే అంశంపై స్థానిక అగ్ని మాపక సిబ్బంది విద్యార్థులకు అవగాహన కల్పించారు. స్థానిక వేంకటేశ్వర ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన కార్యక్రమంలో అగ్ని మాపక అధికారి ఎస్ఆర్ పాటిల్ పలు సూచనలు, సలహాలిచ్చారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

పరిగి: వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి శివశంకర్ మాతృమూర్తి నరసమ్మ సోమవారం అనారోగ్యం చనిపోయారు. విషయం తెలుసుకున్న మంత్రి ఉషశ్రీచరణ్ భర్త చరణ్‌రెడ్డి... నరసమ్మ భౌతికకాయం వద్ద పుష్పగుచ్ఛం ఉంచి నివాళులర్పించారు. అనంతరం బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు.

'నాడు–నేడు'పై నేడు సమీక్ష

రొళ్ల: స్థానిక ఉపాధ్యాయ భవనంలో మంగళవారం ఉదయం 10 గంటలకు రెండో విడత నాడు–నేడు అభివృద్ధి పనులపై హెచ్‌ఎంలతో సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు ఎంఈఓ శ్రీధర్ తెలిపారు. 32 పాఠశాలల హెచ్‌ఎంలు ప్రగతి నివేదికలతో సమీక్ష సమావేశానికి హాజరు కావాలని కోరారు.

క్లుప్తంగా

నేడు జగనన్న ఆరోగ్య సురక్ష

మడకశిరరూరల్: మండల పరిధిలోని కదిరేపల్లి గ్రామ సచివాలయంలో మంగళవారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు కదిరేపల్లి పీహెచ్‌సీ నరేష్‌కుమార్ తెలిపారు. ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎంపీడీఓకు సన్మానం



ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్‌ను సన్మానిస్తున్న దృశ్యం

రొద్దం: మండ కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో కర్నూలు జిల్లాకు బదిలీపై వెళుతున్న ఎంపీడీఓ రాబర్ట్‌విల్సన్‌ను సోమవారం కార్యాలయ సిబ్బంది, ప్రజాప్రతినిధులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రాబర్ట్ విల్సన్ సేవలను వారు కొనియాడారు. కార్యక్రమంలో తహసీల్దార్ అనంతచారి, ఈఓఆర్డీ కేవశరెడ్డి, ఏపీఓ రషీద్, తదితరులు పాల్గొన్నారు.

విద్యాభివృద్ధికి ప్రభుత్వం కృషి



ట్యాబ్‌లు చూపిస్తున్న విద్యార్థినులు

హిందూపురం: రాష్ట్రంలో విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఎనలేని కృషి చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్ ఇర్షాద్ అహ్మద్ అన్నారు. స్థానిక అజీజియా హైస్కూల్‌లో పదో తరగతి విద్యార్థులకు స్టడీ మెటీరియల్, 138 మంది 8వ తరగతి విద్యార్థులకు ట్యాబ్‌లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు ముస్తాక్, ఆయుబ్, కోఆప్షన్ సభ్యులు రహమత్, పాఠశాల హెచ్‌ఎం రంగ నాయకులు, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

భవనాలు ప్రారంభించండి

మడకశిర: మండలంలోని గుండుమల ఎంజేపీ గురుకుల బీసీ జూనియర్ కళాశాలకు చెందిన నూతన భవనాలను వెంటనే ప్రారంభించడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని పీడీఎస్‌యూ నాయకులు విజ్ఞప్తి చేశారు. సోమవారం జిల్లా పీడీఎస్‌యూ అధ్యక్షులు ఉమేష్‌నాయక్, కమిటీ సభ్యులు శశికుమార్, నవీన్‌కుమార్, మధు తదితరులు మాట్లాడుతూ ప్రస్తుతం ఈ కళాశాలను మడకశిరలోని ఇరుకు భవనాల్లో నిర్వహిస్తున్నారని తెలిపారు. నూతన భవనాల పనులు పూర్తి చేసి ప్రారంభించాలన్నారు.

వృద్ధుల ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలి

మడకశిరరూరల్: మండల పరిధిలోని ఆమిదాలగొంది గ్రామంలోని వెంకటేశ్వర వృద్ధాశ్రంలోని వృద్ధులకు సోమవారం ఎస్ఐ లోకేష్ అన్నదానం చేశారు. అనంతరం వృద్ధుల యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. వృద్ధుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని నిర్వాహకులు తిమ్మారెడ్డికి సూచించారు.

బస్సును ఢీకొన్న బొలెరో



ప్రమాదంలో దెబ్బతిన్న బొలెరో వాహనం

చిలమత్తూరు: మండలంలోని 44వ నంబరు జాతీయ రహదారిపై సోమవారం తెల్లవారుజామున కర్ణాటక ఆర్టీసీ బస్సును బొలెరో వాహనం ఢీ కొంది. స్థానికుల వివరాలమేరకు... కొడికొండ చెక్‌పోస్ట్‌లోని గంగోత్రి డాబా వద్ద బాగేపల్లి వైపునకు వెళ్తున్న కర్ణాటక ఆర్టీసీ బస్సును టమాట లోడ్‌తో వెళ్తున్న బొలెరో వాహనం వెనుక నుంచి వచ్చి ఢీ కొంది. ఈ ప్రమాదంలో ప్రమాదంలో బొలెరో, బస్సు దెబ్బతిన్నాయి. బొలెరో వాహన డ్రైవర్ స్వల్ప గాయాలతో బయట పడ్డాడు. టమాటాలను మరో వాహనంలో మార్కెట్‌కు తరలించారు.

వైభవంగా గ్రామ దేవతల ప్రతిష్ట



మారెమ్మ, ముత్యాలమ్మ దేవతలను ప్రతిష్ఠించిన దృశ్యం

పావగడ: పట్టణంలోని కావలగేరి ప్రాంతంలో మారెమ్మ గుడిలో గ్రామ దేవతలు నసనకోట ముత్యాలమ్మ, మారెమ్మ విగ్రహాలను సోమవారం రాత్రి ఘనంగా ప్రతిష్ఠించారు. రామగిరి మండలం ఏడుకురాకులపల్లి గ్రామానికి చెందిన ముత్యాలమ్మను అక్కడి నుంచి పావగడకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. మారెమ్మ జాతరోత్సవాల సందర్భంగా ఇద్దరు దేవతలను భక్తిశ్రద్ధలతో ప్రతిష్ఠించారు. సోమవారం నుంచి శనివారం వరకూ ఆరు రోజుల పాటు జాతరోత్సవాలు జరుగనున్నాయి.

వైఎస్సార్‌సీపీ గెలుపే ధ్యేయం



వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లతో మాట్లాడుతున్న పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త శాంతమ్మ

హిందూపురం: వైఎస్సార్‌సీపీ గెలుపే ధ్యేయంగా పార్టీ శ్రేణులు సమష్టి కృషితో పనిచేయాలని హిందూపురం పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బోయ శాంతమ్మ తెలిపారు. హిందూపురంలోని 5వ వార్డు కౌన్సిలర్ ఇర్షాద్ అహ్మద్ స్వగృహంలో మున్సిపల్ వైస్‌చైర్మన్ బలరామిరెడ్డితో పాటు వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లను ఆమె మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా శాంతమ్మ మాట్లాడుతూ కౌన్సిలర్లు అందరూ ఏకతాటిపై వచ్చి పార్టీ గెలుపుకు కృషిచేయాలన్నారు.

చింత ఫల సాయం వేలం

రొళ్ల: మండల పరిధిలోని బీజీ హళ్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల సమీపంలోని పంచాయతీ ఆధీనంలో ఉన్న చింతఫల సాయం వేలంపాటను సోమవారం సచివాలయం ఆవరణలో నిర్వహించినట్లు ఈఓఆర్డీ క్రిష్టప్ప తెలిపారు. బీజీ హళ్లికే చెందిన మహేష్ అనే వ్యక్తి చింత ఫల సాయం వేలాన్ని రూ.10 వేలకు దక్కించుకున్నట్లు చెప్పారు. అదేవిధంగా మంగళవారం మల్లినమడుగు, బుధవారం రంగనపల్లి చింతతోపు ఫల సాయాన్ని వేలం వేయనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సదాశివప్ప, కార్యదర్శి శ్రీనాథ్, వ్యాపారస్తులు తదితరులు పాల్గొన్నారు.

రేపు చింత ఫలసాయం వేలం

మడకశిరరూరల్: మండలంలోని గౌడనహళ్లి గ్రామ పంచాయతీలోని చింత ఫలసాయాన్ని బుధవారం గ్రామ సచివాలయంలో వేలం వేస్తున్నట్లు ఈఓఆర్డీ శైలజ, గ్రామ కార్యదర్శి సావిత్రి ఓ ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు రూ.2 వేల డిపాజిట్ చెల్లించి పేర్లు నమోదు చేసుకోవాలని కోరారు.

అగళిలో...

అగళి: మండల కేంద్రంలోని చింత ఫలసాయాన్ని ఈ నెల 31న ఉదయం 11 గంటలకు గ్రామ సచివాలయం వద్ద బహిరంగ వేలం వేయనుట్లు సర్పంచ్ లక్ష్మమ్మ , గ్రామ కార్యదర్శి రంగనాథ తెలిపారు. ఆసక్తిగలవారు రూ.5 వేల చొప్పున డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

6న మండల సర్వసభ్య సమావేశం

సోమందేపల్లి: ఫిబ్రవరి 6న మండల పరిషత్ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు. సమావేశానికి ప్రజాప్రతినిధులతో పాటు అన్ని శాఖల అధికారులు తప్పక హాజరు కావాలని కోరారు.

వృత్తి విద్యా కోర్సులపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అమరాపురం: విద్యార్థులు చదువుతో పాటు వృత్తి విద్యా కోర్సులపై అవగాహన పెంచుకోవాలని ఏపీ మోడల్ స్కూల్, జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ ఓబుళపతి తెలిపారు. సోమవారం అమరాపురంలోని గార్మెంట్స్, టైలరింగ్, కెనరా బ్యాంకు తదితర నైపుణ్యాభివృద్ధి సంస్థల వద్దకు విద్యార్థులు హాజరయ్యారు. అక్కడ ఏమేమి విధులు నిర్వర్తిస్తున్నారు? తదితర వాటిని ప్రత్యక్షంగా ఉపాధ్యాయులు ద్వారా తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు మంజునాథ, వేణుగోపాల్, రామసుబ్బయ్య, బాలాజీ తదితరులు పాల్గొన్నారు.

ఉత్తమ అవార్డు గ్రహీతలకు సన్మానం

అమరాపురం: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం అమరాపురం గ్రామానికి చెందిన ఆర్ఎస్ఎస్ నాయకులు తహసీల్దార్ రమేష్‌బాబు, ఎంపీడీఓ మునిస్వామిని ఘనంగా సన్మానించారు. గణతంత్ర వేడుకల సందర్భంగా ఉత్తమ తహసీల్దార్, ఉత్తమ ఎంపీడీఓగా అవార్డులు అందుకోవడంతో వారిని సన్మానించినట్లు నాయకులు తెలిపారు.